# జైలుపక్షి

మినీకథ




- యడ్లపల్లి సత్యనారాయణ

"బామ్మా ఏంటి రాస్తున్నావ్?"

పదేళ్ళ పాప వచ్చి అడిగింది.

"ఉత్తరం అమ్మా"

"ఎవరికి"

"దేవుడికి"

"దేవుడికా!!... దేవుడికి కూడా ఉత్తరాలు వెయ్యొచ్చా?"

"వెయ్యవచ్చమ్మ" రాయడం పూర్తయ్యాక మడత పెడుతూ అన్నారు బామ్మగారు.

"మరి దేవుడి దగ్గరకు పోస్టుమెన్ వెల్తాడా?" అమాయకంగా అడిగింది.

"పోస్టుమేన్ కాదమ్మా! అందరం ఎప్పుడో ఒకప్పుడు అక్కడికి వెళ్ళవలసిందే. నేను వెళ్ళినపుడే తీసుకు వెళతానమ్మా ఈ ఉత్తరం"

"నువ్వే వెళుతున్నపుడు ఉత్తరం దేనికి బామ్మ? నువ్వే మాట్లాడవచ్చుగా దేవుడితో"

"అతని మీద నాకు కోపం తల్లీ! నేను అతనితో మాట్లాడను"

"ఏదీ నేనోసారి ఉత్తరం చదువుతాను ఏం రాసావో" అంటూ బామ్మగారి చేతిలోని ఉత్తరం తీసుకుని పాప చదవడం మొదలుపెట్టింది.

## మగదేవునకు నమస్కరించి వ్రాయునది.

రాచరికాల నుంచి, నియంతృత్వాల నుంచి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కల్పించడానికి ప్రజాస్వామ్యమనే సిద్ధాంతం వచ్చింది. వచ్చాయి స్వేచ్ఛా స్వతంత్రాలు అన్నారు. కాని అవి నాకు ఎక్కడా కనిపించలేదు. ఎందుకో తెలుసా- నువ్వు నన్ను ఆడదానిగా పుట్టించినందుకు.

చిన్నతనంలో ఆడుకోవడానికి వెళ్ళాలంటే ఇంటి దగ్గర అమ్మనో, బామ్మనో- ఎవరో ఒకర్ని అడిగి వెళ్ళాలి. అదే అన్నయ్య అయితే అడగకుండానే వెళ్లొచ్చు. ఆడది అన్ని రంగాలలోనూ ముందడుగు వెయ్యాలి అంటూనే ఆడదాని కాళ్ళు విరగగొడుతున్నారు మగపుంగవులు. పై చదువులకి వెళ్తానంటే ఆడదానికి చదువులెందుకని నన్ను వంటింటికి అప్పజెప్పి, అన్నయ్యను పంపారు పై చదువులకి. వాళ్ళ దృష్టిలో ఆడదంటే అబల!

పెళ్ళి అయ్యాకన్నా స్వేచ్ఛా స్వతంత్రాలు వస్తాయనుకుంటే అతను కూడా నన్ను వంటగదికి, పడకగదికి పరిమితమన్నాడు. నేనేం పాపం చేశానని అతను కూర్చోమంటే కూర్చుని,నుంచోమంటే నుంచోవాలి? అతని దృష్టిలో భార్య అంటే బానిస.

కొడుకుల దగ్గర అన్నా వస్తాయి స్వేచ్ఛా స్వతంత్రాలు అనుకుని మోసపోయాను. ఎప్పుడైనా తోటి వాళ్ళతో కలసి సినిమాకు వెళ్తే ముసలిదానివి నీకెందుకు ఆ సినిమాలు మూలకూర్చుని కృష్ణారామా అనుకోమని శాసించారు. వాళ్ళ నాన్న నాకంటే ముసలి వారైనా అతన్ని ఏమీ అనరు ఎక్కడికి వెళ్ళినా. వాళ్ళ దృష్టిలో ముసల్ది అంటే పనికిరాని వస్తువు.

నేను నీకు ఏం ద్రోహం చేశానయ్యా నన్ను ఇలా కటకటాలు లేని జైలులో బంధించావు. నిజమయిన జైలు అయితే కటకటాలు తెంచుకుని అయినా పారిపోవచ్చు. కాని నేను వున్న జైలుకి కటకటాలు తండ్రి, మొగుడు, కొడుకులు. వాళ్ళని తెంచుకుని పోవడం చాలా కష్టం. ఆడదాని ముక్కు పుటాలు స్వేచ్ఛా వాయువు పీల్చుకునే వరకూ దయచేసి నన్ను ఆడదానిగా పుట్టించకయ్యా.

ఇట్లు

ఓ ఆడది

ఉత్తరం చదివిన పాప కళ్ళలో కదిలీ కదలని సందేహాల నీడలు.